నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | NALGONDA

'మెడికల్ కాలేజీని తరలించొద్దు'

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 12 : యాదాద్రి జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన మెడికల్ కాలేజీని కుంటి సాకుతో సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు తరలించడానికి ప్రయత్నిస్తున్న విధానాన్ని మార్చుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని బాబు జగ్జీవన్‌రావ్ చౌరస్తాలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీని ఇక్కడే నిర్మించాలన్నారు. జిల్లాకు కేటాయించిన మెడికల్ కళాశాలను తరలించుకుపోవాలని ప్రయత్నిస్తుంటే స్థానిక ఎమ్మెల్యేలు నోరుమెదపడం లేదని ఆరోపించారు. జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీని ఇక్కడే ఉంచాలని కోరారు.

భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చలో నల్లగొండ

బీఆర్ఎస్ బహిరంగ సభకు సర్వం సిద్ధం

నేడు సాయంత్రం 4గంటలకు ప్రారంభం

మర్రిగూడ బైపాస్‌లో ఏర్పాట్లు

- విశాలమైన సభా వేదిక, ప్రాంగణం
- సభా ప్రాంగణం నలువైపులా పార్కింగ్ స్థలాలు
- ప్రత్యామ్నాయ మార్గంలో సాధారణ వాహనాల మళ్లింపు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగంపై జనంలో అమితాసక్తి

కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతపై బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. సోమవారం రాత్రి వరకే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ బైపాస్ వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారికి ఆనుకుని విశాలమైన స్థలంలో సభకు ఏర్పాట్లు చేశారు. సభా వేదికతోపాటు కళాకారుల వేదిక, గ్యాలరీలు, బారి కేడింగ్ వంటివన్నీ పూర్తయ్యాయి. జిల్లా నేతలతో కలిసి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే సభకు సంబంధించి క్షేత్ర స్థాయి వరకు విస్తృత ప్రచారం కల్పించిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ప్రసంగించనుండడంతో అందరి దృష్టి ఈ సభపైనే కేంద్రీకృతమైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ మొదలుకానున్నది.

- నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ)

చలో నల్లగొండ బహిరంగ సభ కోసం హైవేకు ఆనుకుని ఉన్న 50 ఎకరాల విశాలమైన స్థలంలో బీఆర్ఎస్ ఏర్పాట్లు పూర్తి చేసింది. గత మూడు రోజులుగా చకచకా ఏర్పాట్లు చేస్తూ వచ్చారు. గతంలో ఇదే స్థలంలో నిర్వహించిన నాలుగు సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో తిరిగి అదే స్థలంలో కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై పోరు శంఖం పూరించనున్నారు. హైదరాబాద్ నుంచి కేసీఆర్ రోడ్డు మార్గాన భారీ కాన్వాయ్‌తో నల్లగొండకు చేరుకోనున్నట్లు సమాచారం. చివరి క్షణాల్లో ట్రాఫిక్, ఇతర అంశాల నేపథ్యంలో హెలికాప్టర్‌లోనూ వచ్చే అవకశాలు లేకపోలేదని పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా సభా ప్రాంగణం పక్కనే హెలిప్యాడ్‌ను, అక్కడి నుంచి సభా వేదికకు చేరుకునేలా ప్రత్యేక రూట్‌ను కూడా సిద్ధం చేశారు. సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్లు, మాజీ కీలక ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ముఖ్య నేతలంతా తరలిరానుండడంతో అందుకు అనుగుణంగా విశాలమైన సభా వేదికను నిర్మించారు. ఇక దాని పక్కనే కళాకారుల వేదికను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సభా వేదికకు ఎదురుగా వీఐపీ, మీడియా, మహిళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను సిద్ధం చేశారు. సభకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా బారీ కేడింగ్ చేశారు. వీఐపీల వాహనాల పార్కింగ్‌ను కూడా సభా వేదికకు ఇరువైపులా చేసేలా చర్యలు చేపట్టారు.

నల్లగొండలో సభా వేదికపై పూర్తయిన ఏర్పాట్లు

నలువైపులా పార్కింగ్‌కు ఏర్పాట్లు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొంటున్న నేపథ్యంలో సభకు పెద్ద సంఖ్యలోనే పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాలతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఎక్కువ మంది హాజరవుతున్నట్లు పార్టీ నేతలు చెప్పారు. వాహనాల పార్కింగ్ కోసం నలువైపులా స్థలాలను సిద్ధం చేశారు. నార్కట్‌పల్లి ప్రాంతం నుంచి వచ్చే వారంతా తమ వాహనాలను పిట్టంపల్లి రోడ్డులోని ఎంఎన్ఆర్ గార్డెన్స్ సమీపంలో నిలిపేలా స్థలం రెడీ చేశారు. దేవరకొండ, మునుగోడు వైపు నుంచి నల్లగొండ పట్టణంలో నుంచి వచ్చే వారు లక్ష్మీ గార్డెన్ సమీపంలోని ఎల్లమ్మ గుడి దగ్గర ఎదురుగా స్థలంలో.. సూర్యాపేట, మిర్యాలగూడ వైపుల నుంచి వచ్చే వాహనాదారులు సభ సమీపంలోనే అద్దంకి-నార్కట్ పల్లి రోడ్డుకు ఇరువైపులా(ఐకేపీ సెంటర్‌లో) వాహనాలు పెట్టే విధంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కేటాయించిన స్థలాల్లో వాహనాలను పార్క్ చేసి సభా స్థలానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

సాధారణ వాహనదారులకు విజ్ఞప్తి

మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి ఏడెనిమిది గంటల వరకు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి సభకు వచ్చి వెళ్లే వాహనాలతో తీవ్ర రద్దీగా మారనుంది. ఈ రూట్‌లో ప్రయాణించాలనుకునే సాధారణ వాహనదారులు ప్రత్యామ్నాయ రూట్‌లో వెళితే మంచిదని సభ నిర్వాహకులు సూచిస్తున్నారు. నార్కట్‌పల్లి వైపు నుంచి నల్లగొండ మీదుగా వెళ్లాలనుకునే వారు వయా నకిరేకల్, తిప్పర్తి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. మిర్యాలగూడ వైపు నుంచి నల్లగొండ మీదుగా నార్కట్‌పల్లి వైపు వెళ్లాలనుకునే వారు వయా తిప్పర్తి, నకిరేకల్ మీదుగా నార్కట్‌పల్లికి వెళ్లాలని సూచిస్తున్నారు. సభకు వచ్చే వాహనాలతో నార్కట్‌పల్లి-అద్దంకి హైవే పూర్తిగా రద్దీగా మారనున్న నేపథ్యంలో ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని నల్లగొండ జిల్లా పోలీసులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. సభకు 500 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు.

నల్లగొండలో సభా ప్రాంగణంలో సాగుతున్న ఏర్పాట్లు

ఏర్పాట్లపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమీక్ష

సభా ఏర్పాట్లను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డ నేతృత్వంలో జిల్లా నేతలు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం రోజంతా స్థానిక, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన సభా ఏర్పాట్లలో బిజీబిజీగా గడిపారు. వారితోపాటు ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, ఎ.జీవన్‌రెడ్డి, క్రాంతికిరణ్, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ నల్లగొండ ఇన్‌చార్జి రవీంద్ర సింగ్, రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్ రెడ్డి వంటి కీలక నేతలంతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆ సందర్భంగా జగదీశ్‌రెడ్డి వివరించారు.

కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందంలో భాగమే

కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత

- కృష్ణా జలాల వివాదం అనేది తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్య
- బీఆర్ఎస్ పోరాటంతోనే కేఆర్ఎంబీపై కాంగ్రెస్ ప్రభుత్వ తీర్మానం
- కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- నేడు నల్లగొండ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

నల్లగొండలో సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్, చిరుమర్తి, జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రవీంద్రసింగ్, గుత్తా అమిత్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీ కంట్రోల్‌లోకి వెళ్లాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కృష్ణా నదిపై ప్రాజెక్టుల సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు మంగళవారం నల్లగొండలోని మర్రిగూడ బైపాస్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ భారీ బహిరంగ సభ స్థలాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభకు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారన్నారు. పదేండ్లు కృష్ణా ప్రాజెక్టులు కేంద్రం ఆధీనంలోకి పోకుండా కాపాడితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వారికి ధారాదత్తం చేసిందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు మంచి నీటి కోసం రోడ్డు ఎక్కొద్దని, ఫ్లోరోసిస్‌ను రూపుమాపాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకం పెట్టామని, దాని వల్ల ప్రజలకు తాగు నీటి కష్టాలు తప్పడంతోపాటు ఒక్క ఫ్లోరోసిస్ కేసు కూడా నమోదు కాలేదని చెప్పారు. కేఆర్ఎంబీ సమావేశానికి వెళ్లేటప్పుడు సీఎం లేదా మంత్రి వర్గంతో సమీక్ష ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ సభ కోసం కృష్ణా పరీవాహక ప్రాంత రైతులు, ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. సభకు లక్షలాదిగా తరలిరావడం కోసం స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారని చెప్పారు. కేఆర్ఎంబీ కంట్రోల్‌లోకి వెళ్లినా కాంగ్రెస్ సీఎం, మంత్రులు సాగర్ ప్రాజెక్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు సాగర్ ప్రాజెక్టును ఆక్రమించడానికి ఏపీ వస్తే తామే తరిమామని గుర్తు చేశారు. కృష్ణా జలాల వివాదం అనేది తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్య అని అన్నారు. కృష్ణా జలాల హక్కులను కేఆర్ఎంబీకి అప్పజెప్పడాన్ని నాడు ఏపీ ప్రభుత్వం ఒప్పుకొన్నా, బీఆర్ఎస్ సర్కార్ ఒప్పుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ నేతలు ఏపీ నాయకులకు ఏజెంట్లుగా మారి తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణా జలాల హక్కు విషయంలో కేంద్రంపై పోరాడాల్సిందిపోయి కాంగ్రెస్ నేతలు తమపై ఎదురుదాడి చేయడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాల హక్కులపై బీఆర్ఎస్ పోరాటంతోనే కేఆర్ఎంబీకి అప్పగించలేదని కాంగ్రెస్ తీర్మానం చేసిందని, కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని చెప్పారు. తెలంగాణ ప్రజలు మరోసారి నీటి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని, నేడు నల్లగొండలో నిర్వహించే సభకు పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సభకు రైతులు స్వచ్ఛందంగా తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి

కృష్ణా ప్రాజెక్టులను కాపాడు కోవాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాల్సిన అవసరం ఉందని, నల్లగొండలో నిర్వహించే సభకు రైతులంతా పార్టీలకతీతంగా కదిలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండలో కోమటిరెడ్డి టీమ్ నిరసనలు చేసినంత మాత్రాన ఎవరూ పట్టించుకోరని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వెళ్తున్నందున వారి నుంచి నిరసన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్ రెడ్డి, చీర పంకజ్ యాదవ్, కొండూరు సత్యనారాయణ, మాలె శరణ్యారెడ్డి, యాట జయప్రదారెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి ఆలయం

బ్రహ్మోత్సవాలకు చెర్వుగట్టు ముస్తాబు

- ఈ నెల 14 నుంచి 21 వరకు జాతర

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 12 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 14 నుంచి 21 వరకు జరిగే జాతరకు జిల్లా అధికారులు, దేవాలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ గోపురాలు, చుట్టు పక్కల ఉన్న శివుడు, గణపతి విగ్రహాలకు రంగులు వేసి అలంకరిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాల కల్పనకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది. బ్రహ్మోత్సవాలకు సుమారు 5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని దేవాలయ సిబ్బంది అంచనా. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ దాసరి హరి చందన అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఘాట్ రోడ్డు వద్ద, గుట్ట కింద రద్దీ ఉన్న ప్రదేశాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేశారు. మంచి నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు.

నగరోత్సవంతో ప్రారంభం

ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు నల్లగొండలోని రామాలయం నుంచి నగరోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ నెల 16న శుక్రవారం రాత్రి(తెల్లవారితే శనివారం17వ తేది) స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 18న ఆదివారం (తెల్లవారితే సోమవారం) స్వామి వారి అగ్నిగుండాలు, 19న సోమవారం(తెల్లవారితే మంగళవారం) దోపోత్సవం, అశ్వవాహన సేవ జరుపుతారు. 20న మంగళవారం రాత్రి మహా పూర్ణాహుతి, పుష్పోత్సవం, ఏకాంత సేవలు నిర్వహిస్తారు. 21న బుధవారం సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపై చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు పరిపూర్ణం చేస్తారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

జాతరకు వచ్చే భక్తులకు నార్కట్‌పల్లి, నల్లగొండ, యాదగిరిగుట్ట, సూర్యాపేట, దేవరకొండ, కోదాడ డిపోల నుంచి ప్రత్యేక బస్తులను నడుపనున్నారు.

నార్కట్‌పల్లి డిపో నుంచి నల్లగొండకు వెళ్లే ప్రతి సర్వీసు చెర్వుగట్టు మీదుగా నడుపనున్నారు. జాతర సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. 15 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐలు, 325 మంది పోలీసులు సిబ్బంది మొత్తం 500 మందితో బందోబస్తు నిర్వహించనున్నారు. గుట్ట పైన, కింద 2 ఔట్ పోస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

గుట్ట పైకి వృద్ధులు, చిన్న పిల్లలను చేరవేసేందుకు 5 ఆటోలను మాత్రమే అనుమతిస్తారు. సీసీ కెమెరాల పుటేజీలను చూసేందుకు 2 ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 2 డ్రోన్ కెమెరాలతో గుట్ట పరిసరాలను పర్యవేక్షించనున్నారు. నీటి వసతి, పారిశుధ్యం, మరుగుదొడ్లు, రవాణా తదితర వసతులపై ప్రత్యేక దృష్టి సాధించామని, స్వామి వారి కల్యాణం, తలంబ్రాల బియ్యం సేకరణలో భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ నవీన్ తెలిపారు.

హుజూర్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, పక్కన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

కేంద్రానికి కృష్ణా జలాల అప్పగింత పాపం కాంగ్రెస్‌దే

- ప్రభుత్వ నిర్వాకంతో పంట భూములు బీడుగా మారే దుస్థితి
- ప్రజలు గెలిపించినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్ ఇచ్చే బహుమానం ఇదేనా?
- నల్లగొండ సభను విజయవంతం చేయాలి
- విలేకరుల సమావేశంలో ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం, శానంపూడి

కోదాడ/హుజూర్‌నగర్, ఫిబ్రవరి 12 : సాగర్ ఎడమ కాల్వ కింద పంటలను ఎండబెట్టి, కృష్ణా జలాల పంపిణీని కేంద్రానికి అప్పగించిన పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ ధ్వజమెత్తారు. కోదాడ, హుజూర్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ బీడు భూములను సస్యశ్యామలం చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంట భూములను బీడుగా మారుస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంతో తెలంగాణ రాష్ట్రం కాల్వల నుంచి సాగర్ నీరు విడుదల చేయాలన్నా, నిలిపివేయాలన్నా, విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నా కేంద్రం అనుమతి తీసుకోవాలని, ప్రజలు గెలిపించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నిర్వాకం ఇది అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలు గెలిపించినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు ఇచ్చిన బహుమానం ఇదేనా అని అపహాస్యం చేశారు. ఆయకట్టు రైతులు కాంగ్రెస్ తీరు పై ఆగ్రహంగా ఉన్నారని, రైతులకు నీరు ఇప్పించేందుకు ఉద్యమ నాయకుడు కేసీఆర్ నడుము బిగించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ నుంచి సాగునీరు అందక మోతె, నడిగూడెం, మునగాల మండలాల్లో 5000 ఎకరాల పంట ఎండిపోయే స్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ నుంచి కూడా నీళ్లు రాక పంటల సాగు తగ్గుముఖం పట్టగా వేసిన పంటలు కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఉత్తమ్ కుమార్ రెడ్డి కట్టుబడి ఉండాలన్నారు. నల్లగొండ సభకు రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు , కౌన్సిలర్ జక్కుల వీరయ్య, నాయకులు బెదవాడ శ్రవణ్, గోపాలకృష్ణ, బెల్లకొండ అమర్, కడియం వెంకట్ రెడ్డి, ప్రదీప్, బసవయ్య పాల్గొన్నారు.

జిల్లా అధికారులకు స్థాన చలనం

రాష్ట్ర వ్యాప్తంగా జడ్పీ సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, డీపీఓల బదిలీలు

సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీలు చేపట్టిన ప్రభుత్వం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 13 స్థానాల్లో ట్రాన్స్‌ఫర్స్

నల్లగొండ, ఫిబ్రవరి 12 : సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి అధికారులను బదిలీ చే స్తూ నిర్ణయం తీసుకుంది. జిల్లా పరిషత్‌లలో సీఈఓలు, డిప్యూ టీ సీఈఓలతో పాటు డీపీఓలను బదిలీ చేస్తూ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆయా హోదాల్లో ఉన్న 13 పోస్టులకు స్థాన చలనం జరిగింది. సీఈఓలు, డిప్యూటీ సీఈఓల స్థానం లో ఉన్న డీఆర్‌డీఓలు, డీపీఓలకు బదిలీ ఉత్తర్వులు అందాయి. ఆయా పోస్టుల్లో ఈ నెల 15వ తేదీ వరకు మూడేండ్ల సర్వీసు పూర్తయి నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉండగా జిల్లాలో ఇప్పటికే పలు ఎంపీడీఓల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే.

అధికారి పేరు	హోదా	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం	హోదా
కాళింది	డీఆర్‌డీఓ	నల్లగొండ	ఆదిలాబాద్	డిప్యూటీ సీఈఓ
విష్ణు వర్ధన్ రెడ్డి	డీపీఓ	నల్లగొండ	యాదాద్రి	డిప్యూటీ సీఈఓ
కె. మురళి	డీపీఓ	నారాయణ పేట	నల్లగొండ	డీపీఓ
సీహెచ్ క్రిష్ణారెడ్డి	జడ్పీ సీఈఓ	యాదాద్రి	రంగారెడ్డి	సీఈవో
నాగిరెడ్డి	డిప్యూటీ సీఈఓ	యాదాద్రి	నల్లగొండ	డీఆర్‌డీఓ
శ్రీనివాస్‌రావు	డిప్యూటీ సీఈఓ	యాదాద్రి	నల్లగొండ	డిప్యూటీ సీఈఓ
కృష్ణన్	డీఆర్‌డీఓ	వికారాబాద్	యాదాద్రి	డీఆర్‌డీఓ
కిరణ్ కుమార్	డీఆర్‌డీఓ	సూర్యాపేట	ఏడీ వ్యవసాయ శాఖ	స్టేట్ ఆఫీస్ రిపోర్టింగ్
సురేశ్	డిప్యూటీ సీఈఓ	సూర్యాపేట	యాదాద్రి	డీఆర్‌డీఓ
యాదయ్య	డీపీఓ	సూర్యాపేట	మెదక్	డీపీఓ
అప్పారావు	జడ్పీ సీఈఓ	ఖమ్మం	సూర్యాపేట	జడ్పీ సీఈఓ
మధుసూదన్ రాజు	డీఆర్‌డీఓ	భద్రాద్రి	సూర్యాపేట	డీఆర్‌డీఓ
శిరీష	అదనపు డీఆర్‌డీఓ	ఖమ్మం	సూర్యాపేట	డిప్యూటీ సీఈఓ

పోలీసుల బదిలీ

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 12 : సూర్యాపేట జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న 25మంది ఏఎస్ఐలు, 13మంది హెడ్ కానిస్టేబుళ్లు, 57మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఉత్తర్వులు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో ఐదేండ్ల సర్వీస్ కాలం పూర్తి చేసుకున్న సిబ్బందికి వారి ఆప్షన్స్ ప్రకారం ఎస్పీ కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీ ప్రకారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగికి బదిలీ సాధారణమని, ఎక్కడ ఉన్నా పారదర్శకంగా, ఆదర్శంగా పని చేయాలని సూచించారు. సిబ్బంది ఆప్షన్స్ ప్రకారం కోరుకున్న పీఎస్‌కు బదిలీ చేయడం సంతోషకరమని ఎస్పీకి అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సెలింగ్ కార్యక్రమంలో జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, సెక్షన్ క్లర్క్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.